# "అరణ్యరోదనం"

"శశి"

(పంకజం చక్కని పిల్ల 12 సం|| వయస్సు రొప్పుతూ పరుగు పరుగున వచ్చేసింది.)

"అమ్మా! అమ్మా! పలకవేమే, అమ్మా!

"అబ్బ ఏం అరుపులే-పాపలేస్తుంది-ఏంటా హడావిడి?

"అమ్మా! మరే పార్వతి వాళ్ళనాన్న యినస్పెక్టరుగారు లేరూ? ఆయనకి ఉద్యోగం పోయిందని తెలిసిందిటే. పాపం వాళ్ళమ్మ ఒకటే ఏడుస్తుంది."

"రవిన్యూ యినస్పెక్టరుగారికా! పాపం. ఏం దురదృష్టమమ్మా - అనుకుంటూనే ఉన్నారు. ఆ పాపిష్టివాడు కక్షపట్టి ఏదో చేస్తాడని ఈ కాంగ్రెసు గవర్నమెంటు ఊరికే వచ్చిందా అమ్మా! ఎన్ని కాపరాలిట్లా కూలిపోయి పిల్లా జెల్లా అల్లాడాలో గదా? వెనకటి గౌరవమే లేకపోయె. ఉద్యోగస్తులన్నా ప్రభుత్వమన్నా ప్రతి ఆకతాయికీ అలుసేనయ్యె. ఏమౌతుంది?"

"ఎవరే అమ్మా పగబట్టింది లక్ష్మి వాళ్ల నాన్నేనా? ఆయనేంటో మెంబరటగా! ఎప్పుడూ పట్నం వెళ్లుతుంటాడే. ఏం చక్కటి కారు కొన్నారనుకున్నా? అందులో రేడియోకూడా ఉంది."

"ఆ మహాత్ముడే నమ్మా ఆ కుటుంబం ఉసురోసుకున్నాడు. యమ్.ఎల్.ఏ అట. నా పిండా కూడు. ప్రజల్ని ఘోషపెట్టించడానికి ఏదో పాలంతగాడాలో తను చెప్పినట్లు తప్పుడు వ్రాతలు రాశాడు గాదని, దొంగకేసు పెట్టించి వాళ్ల జీవనం తీశాడు. మంచిబుద్ధు లెట్లావస్తాయి? చదువా సంధ్యా? పరువా మర్యాదా? ఎప్పుడో పదిరోజులు జైలుకెళ్లి వచ్చాడని ఖద్దరు బురఖా వేసుకొని నాలుగురాళ్లు ఖర్చుపెట్టగానే గొప్పవాడైపోయాడు. మొన్నటిదాకా గోడ్లంట పోకిరీగా తిరిగిన వాడికి మంచి చెడ్డా వివక్షతేంవుంది. ఎంత తోస్తే అంత. ఉద్యోగస్థులు లంచ గొండులు; అన్యాయాలు చేస్తారని చెపుతూనే వాళ్లు లంచాలు పట్టకపోయినా, వాళ్ల బదులూ తన బదులు తనే తీసుకుని అడ్డమొచ్చిన వాళ్లకొంప లిట్లా కూలుస్తున్నాడు."

"అమ్మా వాళ్లమ్మాయి లక్ష్మి కూడానే? ఉద్యోగస్థులు లంచగొండులని ఎప్పుడూ ఎవర్నో ఒకర్ని ఉడికిస్తుంది. దానిమీద కోపంవచ్చి కలెక్టరుగారమ్మాయి నారాయణి బాగానే అడిగిందిలే. ఉద్యోగస్థులు 20 యేళ్లు సంపాదించేదీ మీనాన్న ఏడాదికే సంపాదించేడుగా. లేందే, ఈ కారు, ఈ బియ్యంమర - సిల్కు బట్టలు అన్నీ ఆకాశాన్నుంచి పడుతున్నయి కాబోలు - అన్నదే. అప్పుడు చూడాలి! లక్ష్మి ఏడుపు మొహం పెట్టుకు మొదలకుండా వెళ్లిపోయింది. అమ్మా! మరి లక్ష్మివాళ్లు కాంగ్రెసు వాళ్లు గదా? వాళ్లనాన్న తప్ప యింట్లో యింకెవ్వరూ ఒక్క ఖద్దరు గుడ్డైనా వాడరే. అన్నీ కంట్రోలు గుడ్డలూ, సిల్కు గుడ్డలే. ఇవ్వాళ లక్ష్మి అయిదు గజాల చీర ఎం చక్కని అంచుది కట్టుకొచ్చిం దనుకున్నావ్. వాళ్ల పాపక్కూడ వాయల్ గౌను మంచిది కుట్టించారు. అదీ కంట్రోలుదేనట. నాకూ అలాంటి చీర ఒక్కటి కొనవుటే అమ్మా!"

“ఎక్కడ తెమ్మంటావు తల్లీ ! కడుపు కట్టుకునైనా, ఏ ముద్దు మురిపాలు చూసుకుందా మనుకుంటే, ఆ కంట్రోలు గుడ్డలన్నీ, 'అటు చీకటి బజారుల్లో కొనే మహారాజులకీ, యిటు అధికారాలు చేతుల్లో ఉన్న వాళ్ళకేగాని-కడుపు కూటికే కరువనుభవించే బడిపంతులు కెవరిస్తారమ్మా ? వాళ్ళకంటే, కాంగ్రెసు వాళ్లు గనుక గ్రామ నౌకరు మొదలు మహా మంత్రి వరకు వాళ్ళ వాళ్లు గనుకా, ఏ గుడ్డ కట్టుకున్నా, ఏం చేసినా చెల్లుతుంది. మన-కెలా వస్తవీ, కబుర్లు చాలించి అన్నం తిను”

“అమ్మా యీఅన్నమేంటో వాసనగా ఉందే. నే తినలేను నా కొద్దే. పప్పూలేదు, నెయ్యీలేదు, కూరాలేదు, మజ్జిగాలేదు. వచ్చడితో ఎలాగెంటి తినేది ? రోజూ యింతే నువ్వు”

(తల్లి కళ్లంట జల జల కన్నీరు)

“ఈ పాపిష్టిదాన్ని దేవుడు తీసుకుపోతే ఈ కష్టాలు కళ్లబడకపోనే నా తల్లీ ! ఎదిగే పిల్లలు ! ఈ దరిద్రపు రేషన్ కూడు తినలేక నరిగెలై పోతున్నారు. ఎవరికి వాళ్ళే స్వలాభం చూసుకుని ఈ నాశనపు కంట్రోళ్లు తీసెయ్యకుండా నాటకమాడుతున్నారు. నా బిడ్డల ఉసురు తగిలి వీళ్ల అధికారా లెన్నడు నాశనమై పోతయ్యో, కట్టుకోను గుడ్డా ? కడుపునిండా కూడా ? స్వరాజ్యంట, స్వరాజ్యం ! జెండాలు పట్టుకు గంతు లెయ్యడానికీ. డబ్బున్న వాళ్లు బాగుపడ్డానికీ !”

“అబ్బ ! ఏడవ్వాకే అమ్మా ! నాకూ ఏడుపొస్తుంది. పోనీ నాన్నకూడ ఆ మెంబరు పని చేయించుకో గూడదూ ? లక్ష్మివాళ్లు చక్కటి సన్న బియ్యం తింటున్నారుగా ? పైగా వాళ్ల బామ్మ వొడ్డి వాకిట బోలెడంత మందికి మంచి బియ్యం అమ్ముతుంది. పోనీ నువ్వక్కడన్నా కొని తెప్పించగూడదే అమ్మా !”

“పిచ్చి తల్లీ ఏ జన్మలోనో పెట్టి పుట్టేరు. అన్నీ సాగుతున్నాయి. మన కెందు కమ్ముతారు. పిచ్చి తల్లీ ! కాంగ్రెసు గవర్నమెంటు ! శుద్ధన్యాయం ! ఏమీ అనరాదు ! మనం దరిద్రులం. కూలివాళ్లు రోజూ రెండూ మూడూ సంపాదిస్తారు. యింట్లో నలుగురుంటే ముగ్గురన్నా కూలికి వెడతారు. మీ నాన్న సంపాదన రోజుకు రూపాయి పావలా. మనం తినేది ఎనిమిదిమంది. ఆ బియ్యం రూపాయకు ఒక శేరు చొప్పున ఎలాకొంటాము ? ఈ రోజుల్లో మన కంటే కూలివాళ్లు నయం తల్లీ-ఏం బ్రతుకో ! ఎందుకు బ్రతకడమో ? అయ్యో అదేమిటే - చెయ్యి కడిగేస్తున్నావు. నా పాపం పాడైపోనూ; ఆకలితో ఎట్లా నిద్రపోతావే. నాకు చావు రాకుండా వచ్చిందమ్మా !”

(మాస్టరు రామమూర్తి వాడినమొఖంతో నెమ్మదిగా యింట్లోకివస్తూ పైమాటలువింటాడు)

“ఏమిటే పంకజం ? ఎందుకు అమ్మను విసిగిస్తున్నావు ?”

“కాదునాన్నా ఈ వాసనకొట్టేఅన్నం, ఉత్తపచ్చడి, ఎలాతినేది నువ్వేచెప్పు ? వద్దంటే అమ్మ ఊరికే ఏడుస్తుంది. రోజూయింతే”

(ఖిన్నుడైపోయి కాస్సేపు నిలబడి ధైర్యంతెచ్చుకుంటాడు)

పిచ్చిపిల్లా ! అదేనాగోల ? అందరితోపాటేనా మనమూను. ఎలాచెప్పమరి ? కొన్నాళ్లుకష్టం, కొన్నాళ్లుసుఖం, ఈసారి మంచిబియ్యం వస్తవితే తినమ్మా ! తిను !

(తల్లి అవ్యంగ్యంగా)

"తినమ్మా తిను! ఆ కాంగ్రెస్సంటే అలా అభిమానాలు పెట్టుకు పాకుల్లాడుతారు. చూచే నాథుడు లేడు. ఒక మినిష్టరుకో ఒక యమ్. యల్. ఏ కో ఈ ముప్పయిరూపాయల జీతమిచ్చి, ఈ రేషనింగు కూడు తినిపించి, ఈ చీలికలు వాళ్ల పెండ్లాంపిల్లల చేకట్టిస్తే తెలుస్తుందిసంగతి. వాళ్ల కార్లేమో - వాళ్ల విమానప్రయాణాలేమో - వాళ్ల సన్మానసౌఖ్యాలేమొ - పర్మిట్లవ్యాపారాలేమొ - మిల్లులనిర్మాణాలేమొగాని, సామాన్యప్రజ ఎలాచస్తున్నారన్నమాట లేదుగదా? పుగాకు వేరుశనగమాన్పించి, తిండిగింజలు ప్రత్తి పండించమని శాసనంచేస్తే ఈ ప్రజాఘోష ఉండదుగా. మన దుగ్ధపట్టలేక అనుకోడమేగాని, కంట్రోలు, పుగాకు, వేరుశనగలేకపోతే, ఈ ప్రభుత్వనాటకానికి కథేలేదు. పలుకుబడీ, సంపాదనా, మళ్లీ ఎలక్షన్లలో, మంత్రులుగానో, వాళ్లతాబేదార్లగానో వచ్చేమార్గం అన్నీ వాటిల్లోనే ఉండె.

బ్రిటిష్ నిరంకుశత్వంపోయి కాంగ్రెసు నిరంకుశత్వం వచ్చింది. పైపెచ్చు, వచ్చిందేమంటే, దొంగవ్యాపారాన్ని ప్రోత్సహించడంవల్ల సామాన్యప్రజ మలమలమాడిపోవడం, మిల్లులువృద్ధికావడం మూలాన పాడిపంట ప్రజాసౌకర్యానికి వినియోగపడకుండా, రూపాయల మూటల వంకచూస్తూ రోగాల పాలై కృశించిచావడం"

(రామమూర్తి కొంచెంకోపంగా) లలితా! మరీ రానురాను ఈ కష్టాలవల్ల నీకు యుక్తాయుక్త విచక్షణకూడా లేకుండాపోతున్నదేం? నిన్నా మొన్నటివరకూ బాపూజీభక్తురాలివి! తీరాస్వరాజ్యం వచ్చేటప్పటి కింతయారయ్యావ్? మనకర్మానికితరులను దూషించడమెందుకు? తప్పు. పదవీవ్యామోహంలో కొట్టుకుపోతూన్న వ్యక్తులతప్పుగాని యిది కాంగ్రెసు ఆదర్శలోపంకాదు. మహనీయులు, దుర్మార్గులు, అన్నిసంస్థల్లో ఉన్నారు మనంకొన్నాళ్లు కష్టంసహించి శాంతంగాఉండాలి. మనసౌకర్యాలకోసరం ప్రభుత్వాన్నిఅడిగి, నిరీక్షించాలిగాని త్వరపడి దూషించకూడదు. హోటళ్లప్రాబల్యంవల్లనే భావిప్రజకావలసిన బిడ్డలంతా పాలు, పెరుగు, నేయివంటి పోషకపదార్థాలకు కరువై రోగాలపాలవుతున్నారు. బ్లాక్‌మార్కెటువల్ల అన్నిరకాల ఉద్యోగస్థులూ అక్రమసంపాదనకు పూనుకుంటున్నారు. బంట్రోతువద్దనుండి మహామంత్రివరకూ, వ్యాపారస్థులకు లోబడడంమూలాన్ని మోతుబరిరైతు కూడా వ్యాపారసరళిగా వేరుశనగ, పుగాకులే, పండిస్తూ ఉన్నతిండిగింజలు దొంగమార్కెట్లో నాలుగింతలుగా అమ్ముతున్నాడు. అందరిదృష్టీ, రూపాయలలో కేంద్రీకరించడంచేత, ఏమాత్రం సంస్కరించినా గొప్పవారంతా నష్టాలపాలు కావలసి వస్తుందని, ఎవరంతట వాళ్లే తటస్థంగా ఊరుకుంటున్నారు. యుద్ధకాలంలో పెట్టిన అదనపుఆఫీసులూ, పుగాకు, వేరుశనగా, నిషేధిస్తే, కరువే మాయమవుతుంది. అంకెలమూలంగ చూపించే తిండికొరత లెక్కలన్నీ బూటకపు నటన - వ్యాపారస్థులు మధ్యరకంప్రజల్ని బలిచేయడానికి పన్నేవల. నిజంగా ఆహారానికి కొరతఎవరికి? డబ్బులేనివాడికి! ప్రభుత్వం యింకెపుడు కళ్లుతెరిచి ఈ తప్పుదిద్దుకుంటుందో". "ఆ దిద్దుకుంటారు! శాంతంగాచూడండి మహాప్రభూ. బిడ్డలఆకలిబాధ - బట్టలకరువుచూడలేక నాలాంటి కన్నకడుపులు దహించుకుపోయాక మీ ప్రభుత్వం శాంతంగా తప్పుదిద్దుకుంటారు. అప్పుడు లాభాలతో పొట్టలుపెంచినవారు, పదవులతో మదించినవారూకలిసి, స్ట్రైకులతోసాధించే; కూలిజనాల్తో ఘర్షణపడలేక, మళ్లా ఏమధ్యవర్తికో అధికారప్రదానం చేస్తారుచూడండి; ఈకన్నతల్లులకన్నీళ్లు, పసిబిడ్డలఉసురూ, రామరామ! ఈరాజ్యం ఎన్నాళ్లు నిలుస్తుందండీ? నాకెందుకుబాబూ. నాఅరణ్యరోదన ఎవరిక్కావాలి. అయుర్దాయమున్నవాళ్లు బ్రతికేదీ, ఆనక అందరితో పాటే చీకటిపడింది. ఈ ఘోషఎప్పుడూ ఉన్నదేగాని పాపనికాస్తపట్టుకోండి దీపంపెట్టివస్తాను.